క్లుప్తంగా

ఆర్డీఓగా భవాని



పలమనేరు: పలమనేరు ఆర్డీఓగా భవాని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తూ బదిలీపై ఆర్డీఓగా ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఆర్డీఓ మనోజ్‌రెడ్డి కడప మున్సిపాలిటీకి బదిలీ అవడం విదితమే. నూతన ఆర్డీఓకు కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం తెలిపారు. తాను పెండింగ్‌లోని భూ సమస్యల కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని ఆమె చెప్పారు.

27న రామమూర్తి విగ్రహావిష్కరణ

పుంగనూరు: శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థల దాత, శుభారాం ట్రస్ట్ చైర్మన్ దివంగత రామమూర్తి విగ్రహావిష్కరణ ఈ నెల 27న కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ వాసులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ముగ్గురి ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల బృందం

సదుం: రాష్ట్ర స్థాయి అండర్–14 కబడ్డీ పోటీలకు తమ స్కూలు విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారని స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం జయకుమార్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ధరణీధర్, జాహ్నవి, గుణశేఖర్ పుత్తూరులో జరిగిన పోటీలలో ప్రతిభ చాటి ఎంపికయ్యారని వెల్లడించారు. వీరు బాపట్ల జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారని చెప్పారు. ఉపాధ్యాయ బృందం వారిని అభినందించింది.

పశుగణన ప్రారంభం

పుంగనూరు: మండలంలోని చదళ్ల గ్రామంలో శుక్రవారం పశుగణన కార్యక్రమాన్ని వెటర్నరీ ఏడీ డాక్టర్ మనోహర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, తొలుత గ్రామాల్లో 16 రకాల పెంపుడు జంతువుల సమాచారం సేకరిస్తున్నట్లు చెప్పారు. పశుసంవర్థక రంగాన్ని మెరుగుపరిచేందుకు అవసరమైన నిధులు, పథకాల రూపకల్పన చేసి, వాటిని అమలు చేసేందుకు పశుగణన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రైతులు తమ పశువుల వివరాలు తెలియజేయాలని కోరారు.

రక్తదాన శిబిరానికి స్పందన



వి.కోట: పోలీసు అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు వి.కోట సీఐ సోమశేఖర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. పోలీసులతోపాటు పలువురు స్థానికులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని ఆయన చెప్పారు.

మామిడి పూత, పిందె దశలో జాగ్రత్త వహించాలి

- డీడీ మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీడీ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు: మామిడి తోటల్లో పూత, పిందె దశలో రైతులు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యానవనశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక మండల కార్యాలయంలో శాస్త్రవేత్త బాలహుస్సేన్, డీడీ అగ్రికల్చర్ విజయశంకర్‌రెడ్డి, ఏడీ శివకుమార్‌తో కలసి 8 మండలాల రైతు సేవా కేంద్రాల సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. డీడీ మాట్లాడుతూ, మామిడి సాగు అధికంగా ఉన్నా రైతులు లాభసాటిగా వాటిని మార్చుకోలేకపోతున్నారని కారణాలను విశ్లేషించారు. మామిడి తోటలకు మూడు దఫాలుగా కీటక సంహారిని బ్రూఫేజన్‌లను పిచికారీ చేయాలన్నారు. ఈ విషయంలో ఎఫ్‌పీవోలను రైతులకు అనుసంధానం చేసి నేరుగా పంటలు విక్రయించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. శాస్త్రవేత్త బాలహుస్సేన్ మాట్లాడుతూ, తెగుళ్ల నివారణ, పక్షకన్ను తెగులు వాటికి థైనోఫేట్ లేదా ఆక్సిస్ట్రాబిన్ ఒక గ్రాము ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మొదటిసారి చెట్టుపై పూర్తిస్థాయిలో మందులు పిచికారీ చేస్తే తెగుళ్లను పూర్తిగా నివారించేందుకు వీలుందన్నారు. సదస్సులో హార్టికల్చర్ ఆఫీసర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

కొత్త బస్సులు ప్రారంభం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో శుక్రవారం ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు, డీపీటీఓ జగదీష్ కొత్త బస్సు సర్వీసులను ప్రారంభించారు. చిత్తూరు – బెంగళూరుకు కొత్తగా 4ఎక్స్‌ప్రెస్ బస్సులు, చిత్తూరు–హైదరాబాద్ సూపర్ లగ్జరీ బస్సును తీసుకొచ్చారు.

డ్రగ్స్ కేసట.. డబ్బులివ్వాలట..!

ఆగంతకుడు: హలో బాబూ బాయ్..!

బాబు: ఎస్..

ఆగంతకుడు: మై బెంగళూరు మే సీబీఐ ఆఫీసర్ హు. తుమ్‌హారా బేటీ బెంగళూరు మే సాఫ్ట్‌వేర్ కామ్ కర్తీ హైనా..(నేను బెంగళూరులో సీబీఐ ఆఫీసర్‌ను. మీ అమ్మాయి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తోంది కదా)

బాబు: హా..సర్

ఆగంతకుడు: ఓ బచ్చీ ఫ్రెండ్స్‌కే సాత్ పబ్‌కే జాకో డ్రగ్స్ యూజ్ కర్తే..హమ్ కేసు బుక్ కియా హై..బచీకో కేస్ నహీ హోనాతో అర్జెంట్ మే ఏక్ లాక్ రూపయే ఏ నంబర్‌కో ట్రాన్స్‌ఫర్ కరో (మీ అమ్మాయి పబ్‌లో ఫ్రెండ్స్‌తో కలిసి డ్రగ్స్ సేవిస్తూ మాకు పట్టుబడింది. కేసు బుక్ చేశాం. కేసు కాకుండా ఉండాలంటే లక్ష రూపాయలు మేం చెప్పిన నంబర్‌కు వెంటనే ట్రాన్స్‌ఫర్ చేయండి)

బాబు: 'సార్..గివ్‌మి సమ్ టైం ప్లీజ్..'అని కాల్ కట్ చేశారు. వెంటనే తన భార్య సెల్‌ఫోన్ నుంచి తన కుమార్తెకు ఫోన్ చేశారు. ఎక్కడున్నావమ్మా! అని ప్రశ్నించారు. డాడీ నేను ఆఫీసులోనే ఉన్నా..అని బదులివ్వడంతో కాల్ కట్ చేశారు. తిరిగి ఆగంతకుడికి కాల్ చేశారు. అయితే అతడు కాల్ కట్ చేసి అతడే మళ్లీ చేశాడు.

ఆగంతకుడు: బాబూ బాయ్.. అమౌంట్ రెడీ కర్‌నా..

బాబు: 'యూ..బ్లడీ ఫూల్..మై రిలేటివ్స్ ఆల్సో వర్కింగ్ ఇన్ పోలీస్ డిపార్ట్‌మెంట్. టెల్‌మి యువర్స్ హయ్యర్ అఫిషియల్ సెల్ నంబర్..'..అని గట్టిగా ప్రశ్నించేసరికి ఆగంతకుడు సెల్ స్విచ్ఛాఫ్ చేశాడు.



- సైబర్ కేటుగాళ్ల కొత్త పంథా
- సీబీఐ అధికారుల పేరిట వాట్సాప్ కాల్స్
- బెదిరిపోతే జేబులు గుల్ల
- అప్రమత్తమై నిలదీస్తే ఫోన్ స్విచ్ఛాఫ్



తాను సీబీఐ నుంచి మాట్లాడుతున్నానంటూ వాట్సాప్ కాల్‌లో బెదిరించిన కేటుగాడు

పలమనేరు: ఇదీ ఓ సైబర్ కేటుగాడు, పలమనేరుకు చెందిన రియల్టర్ బాబుకు నడుమ ఇటీవల సాగిన సంభాషణ. సైబర్ కేటుగాళ్లు డబ్బులు కాజేందుకు ఎప్పటికప్పుడు కొత్త పంథాలో వెళ్తున్నారు. సైబర్ కేటుగాళ్లు తాము ఒక విధానంలో చేసే మోసంపై జనాలకు అవగాహన కలిగితే, ఆ తర్వాత ఆ విధానానికి స్వస్తి పలికి, సరికొత్త ఎత్తుగడలతో డబ్బులు కొట్టేసేందుకు యత్నిస్తున్నారు. బ్యాంక్ అకౌంట్‌కు అనుసంధానం చేసుకోవాలని, కేవైసీ చేసుకోవాలని కొంతకాలం క్రితం వరకు బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు కాజేసేవారు. ఈ మధ్యన డ్రగ్స్ (మత్తుమందులు) పేరిట టోకరా వేసేందుకు యత్నిస్తున్నారు. డ్రగ్స్ సేవిస్తూ మీ కుమార్తె/కుమారుడు పట్టుబడ్డారని, కేసు కాకుండా ఉండాలంటే డబ్బులు పంపాలని వాట్సాప్ కాల్స్‌లో సైబర్ కేటుగాళ్లు బెదరగొడుతూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. ఇది నిజమేమోనని, పదిమందికీ తెలిస్తే తమ పరువు పోతుందని హడలిపోయి కేటుగాళ్లకు డబ్బులు సమర్పించి కొందరు మోసపోతుండగా, మరికొందరు అప్రమత్తమై నిలదీస్తే కేటుగాళ్లు స్విచ్ఛాఫ్ చేస్తున్నారు.

కాల్ డాటా ఆధారంగా..

బెంగళూరులో ఉంటున్న విద్యార్థులు, లేదా ఉద్యోగుల ఫోన్ నంబర్ల లిస్టును సంబంధిత నెట్‌వర్క్ నుంచి కొందరు కేటుగాళ్లు పొందుతున్నారు. ఆపై ఈ సిమ్ నంబర్లు ఆధారంగా అందులోని ఆధార్ చిరునామాను గమనించి కాల్స్ చేస్తున్నారు. సిమ్ పొందే సమయంలో మనమిచ్చిన ఆధార్‌లో చిరునామా, తండ్రిపేరు, ఇంటి నంబరు తదితర వివరాలుంటాయి. కేవలం బెంగళూరులో ఉన్న వారి కుటుంబీకులకు ఫోన్ కాల్స్ ఇటీవల ఎక్కువగా వస్తున్నాయి. ఇలాంటి బెదిరింపు కాల్స్ ఈ మధ్యలో ఎక్కువగా వస్తున్నాయి. కొందరు భయపడి డబ్బును ట్రాన్స్‌ఫర్ చేసి ఆపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేయకుండా మౌనం వహించివారు లేకపోలేదు. కాబట్టి ఇలాంటి మోసాలు చేసే వారి మాటలకు బెదరకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. అంతేకాకుండా నిర్భయంగా ఫిర్యాదు చేయాలని చెప్పారు.

+92 కోడ్‌తో పాకిస్తాన్ నంబర్ నుంచే ఎక్కువగా కాల్స్

శాంతిపురానికి చెందిన టీచర్ బాలక్రిష్ణకు +92 34070 75957 నంబర్ నుంచి ఇటీవల కాల్ వచ్చింది. బెంగళూరులో మీ అబ్బాయి ప్రశాంత్‌ను డ్రగ్స్ కేసులో అరెస్ట్ చేశామని కాసేపట్లో కోర్టుకు తీసుకెళ్తామని మీ అబ్బాయిపై కేసు లేకుండా ఉండాలంటే రూ.లక్ష ట్రాన్స్‌ఫర్ చేయాలని బెదిరించారు. అయితే ఆయన కుమారుడు గతంలో బెంగళూరులో ఉద్యోగం చేస్తూ ఇటీవల దాన్ని వదులుకొని ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో బాలక్రిష్ణ తన కుమారుడు ఇంట్లోనే ఉంటే ఎలా అరెస్ట్ చేశారని ప్రశ్నించడంతో ఆ కేటుగాడు తన సెల్‌ను స్విచ్ఛాఫ్ చేశాడు. ఆ నంబర్‌ను ట్రూకాలర్‌లో పరిశీలిస్తే అది పాకిస్తాన్‌కు చెందిన నయాన్ అని డిస్‌ప్లే అయింది.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పలమనేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అనిమల్ హస్బెండరీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఎంఎస్సీ డెయిరీ లేదా జువాలజీ చదివి, యూజీసీలో నెట్, లేదా పీహెచ్‌డీ చేసిన వారు ఈనెల 30లోపు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

విద్యార్థులకు హోమియో మందులు పంపిణీ

పుంగనూరు: సీజనల్ వ్యాధుల విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హోమియో వైద్యాధికారి నాగేనాయక్ కోరారు. శుక్రవారం పట్టణంలోని ఏటిగడ్డపాళెం మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు హోమియో మందులు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. రోడ్డు పక్కన విక్రయించే తినుబండారాలు తినరాదన్నారు.

నేడు మండల సమావేశం

పుంగనూరు: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10:30 గంటలకు ఎంపీపీ భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లీలా మాధవి శుక్రవారం తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

28న పులిచెర్లలో..

కల్లూరు (రొంపిచెర్ల): ఈ నెల 28న సోమవారం పులిచెర్ల మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు జరుగుతుందని ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులందరూరు హాజరు కావాలని కోరారు.

రహదారులు అధ్వానం



చెన్నారెడ్డిపల్లె నుంచి పుంగనూరు మండల సరిహద్దు వరకూ వెళ్లే రహదారి దుస్థితి

పెద్దపంజాణి: మండలంలోని పలు గ్రామాల రహదారులు అధ్వానంగా మారాయి. ప్రభుత్వం వీటిని పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీటీ రోడ్లు సైతం గుంతలు పడి మట్టి రోడ్లుగా దర్శనమిస్తున్నాయి. మోకాళ్ల లోతు గుంతలతో అవస్థలు తప్పడం లేదు. చిన్నపాటి వర్షానికి రోడ్లు జలమయమై కుంటలను తలపిస్తున్నాయి. ముఖ్యంగా మండలంలోని చెన్నారెడ్డిపల్లె నుంచి కొళత్తూరు మీదుగా పుంగనూరు మండల సరిహద్దు వరకూ వెళ్లే రోడ్డు దారుణంగా మారింది. ఈ రహదారిపై ప్రతి రోజూ వందలాది వాహనచోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి మొత్తం తారు కొట్టుకుపోయి, కంకర తేలి గోతులమయమైంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి గుంతలమయంగా ఉన్న రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని కోరుతున్నారు.

కేసులో సాక్షిపై దాడి

పలమనేరు: గతంలో ఓ మహిళపై దాడి చేసిన కేసులో సాక్షిగా ఉన్నందుకు నిందితుడు కౌన్సిలర్ హైదర్ తనపై దాడి చేశాడని స్థానిక జెండామతానికి చెందిన రియాజ్‌బాషా వాపోయాడు. అతను శుక్రవారం పలమనేరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పాత కేసులో నిందితుడిగా ఉన్న హైదర్ ఇటీవల బెయిల్‌పై వచ్చాడు. కాపుగాచి మసీదు వద్ద శుక్రవారం దాడి చేశాడని తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మండల విద్యార్థులు



రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నారాయణవనం: మండలంలోని పాలమంగళం ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు మనోహరి తెలిపారు. తిరుపతిలో నిర్వహించిన అండర్–19 కబడ్డీ పోటీలలో తమ స్కూల్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థి రాహుల్, పుత్తూరులో జరిగిన అండర్–14 పోటీలలో 9వ తరగతి విద్యార్థులు రాఖీ, కీర్తి ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఫిజికల్ డైరెక్టర్ రాజా చెప్పారు. ఈ ముగ్గురూ కావలిలో నవంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలియజేశారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న పలమనేరు పోస్టల్ సబ్‌ఇన్స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి

బైరెడ్డిపల్లె: పోస్టాఫీసుల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు పోస్టల్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి కోరారు. బైరెడ్డిపల్లెలో శుక్రవారం తపాలా సేవలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 నుంచి 65 ఏళ్లలోపు వారికి హెల్త్ ప్లస్ అండ్ ఎక్స్‌ప్రెస్ హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం ఉందన్నారు. ఏడాదికి రూ. 549 చెల్లించి ఖాతా చేసుకున్న వారికి రూ.10 లక్షలు, ఏడాదికి 749 చెల్లించి ఖాతా చేసుకున్న వారికి రూ.15 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందన్నారు. యాక్సిడెంట్, శాశ్వత వైకల్యం, ప్రమాదవశాత్తు వైద్య ఖర్చులు తదితర వాటికి వర్తిస్తాయన్నారు. పాలసీల కోసం పోస్టాఫీసు అధికారులను సంప్రదించాలన్నారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్



పుంగనూరు కోర్టులో పోలీస్ అధికారులతో సమావేశమైన సీనియర్ సివిల్ జడ్జి శిరీష్

పుంగనూరు: జాతీయ లోక్ అదాలత్‌ను డిసెంబర్ 14న నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష్ తెలిపారు. శుక్రవారం కోర్టులో డీఎస్పీ ప్రభాకర్, సీఐ శ్రీనివాసులుతో కలసి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు చెప్పారు. రాజీకి అనుకూలమైన అన్ని రకాల కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమ సమస్యలను సామరస్య ధోరణిలో పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇక్కడ పరిష్కరించే కేసులపై అప్పీల్ ఉండదని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించండి



తూర్పు మొగసాల సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

పుంగనూరు: ప్రజా సమస్యల పరిష్కారంలో సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషాతో కలసి ఆయన తూర్పు మొగసాలలోని 1, 2 సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, పరిసరాల శుభ్రత, సమస్యల నమోదు తదితర విషయాలను పరిశీలించి ఆయన మాట్లాడారు. సచివాలయాలలో కార్యదర్శులపై పలు ఫిర్యాదులు వస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాలని, ఫిర్యాదులు పదే పదే వస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

నిధులను దారి మళ్లిస్తే ఉపేక్షించం

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



ఎంపీడీఓతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్

గంగవరం: మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంజూరయ్యే నిధులను సత్వరమే సంబంధిత ప్రజాప్రతినిధులకు కేటాయించాలని, వాటిని దారి మళ్లిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అభివృద్ధి పనులపై కార్యాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. అధికారంలో ప్రభుత్వం ఏది ఉన్నప్పటికీ పార్టీలకతీతంగా గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. దీనిని అధికారులు దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా పని చేయాలని హితవు పలికారు. పనుల్లో జాప్యం వహించకుండా వెంటనే తీర్మానం చేసి సంబంధిత ప్రజాప్రతినిధులకు నిధులను కేటాయించాలని ఎంపీడీఓ సురేష్‌బాబుని ఆదేశించారు. అలా కాకుండా నిధులను దారి మళ్లించేందుకు యత్నిస్తే ఎంత దూరం వెళ్లడానికైనా సిద్ధమేనన్నారు. చట్ట ప్రకారమే అధికారులు నడుచుకోవాలేగానీ ఎవరి ఒత్తిళ్లకూ లొంగనవసరం లేదన్నారు. సమావేశంలో ఇరిగేషన్, వ్యవసాయ అధికారులతో పలు అంశాలపై ఆయన చర్చించారు.

పచ్చదనం పెంపు అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న కడా పీడీ, ఎమ్మెల్సీ

కుప్పం: పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తిరుపతి గంగమ్మ దేవాలయం రోడ్డు డివైడర్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పచ్చదనం పెరిగితే అందరికీ మంచి ఆరోగ్యం, స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. పట్టణ సుందరీకరణకు ప్రత్యేకంగా మొక్కలు తీసుకువచ్చామని, ప్రజలందరూ ఇందులో భాగస్వాములై మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, అధికారులు, నేతలు పాల్గొన్నారు.

నిరుపేద రైతులకు భూ పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

సదుం: వ్యవసాయంపై ఆధారపడ్డ భూములు లేని నిరుపేదల రైతులకు ప్రభుత్వం మూడు ఎకరాల భూమిని పంపిణీ చేయాలని అంబేడ్కర్ సేన జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో దళిత సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాటాడుతూ, రాష్ట్రంలో కోటిన్నరకు పైగా నిరుద్యోగులు ఉన్నారని..ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి ఉపాధి కల్పించాలన్నారు. ఉపాధి నిబంధనలు సవరించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. ఉపాధి హామీలో 200 రోజుల పని దినాలు కల్పించి, గ్రామీణ ప్రాంతాల్లో రూ.350, అర్బన్ ప్రాంతాల్లో రూ. 450 వేతనం అందేలా చూడాలన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణయ్య, సీతాపతి, మాజీ ఎంపీపీ వెంకటస్వామి, రాంబాబు, మదనమోహన్, వెంకటరమణ, కుమార్, రమణ, రెడ్డెప్ప, చంద్ర, మల్లికార్జున, రవి పాల్గొన్నారు.

పుష్పవిలాపం

- తగ్గిన బంతి, చామంతి ధరలు
- ధరలు లేక మార్కెట్ బయట పారపోసిన రైతులు



మార్కెట్ బయట పారబోసిన బంతిపూలు

కుప్పం రూరల్: కుప్పం మార్కెట్‌లో ధరలు లేక బంతి, చామంతి రైతులు బయట పారపోసి వెళ్తున్నారు. దసరా సందర్భంగా కిలో 80 రూపాయలు పలికిన బంతి శుక్రవారం ఏకంగా రూ.10కి పడిపోయింది. వర్షానికి తడిసిన పూలను కొనేవారు లేక మార్కెట్ బయట పారబోయాల్సి పరిస్థితి కలిగిందని రైతులు వాపోయారు.. చామంతి పూల పరిస్థితి కూడా దాదాపు ఇలాగే ఉంటోంది. విజయదశమి రోజున కిలో రూ.150 నుంచి 200 వరకు పలికిన చామంతి శుక్రవారం 20 నుంచి 40 రూపాయలకు పడిపోయింది. దీంతో రైతులు కోత కూలి కూడా రాదని కన్నీటిపర్యంతమయ్యారు.

నా చాంబర్‌లో టీడీపీ నేతల ప్రెస్‌మీట్ ఏంటి?

- ఎంపీపీ రోజా ఆగ్రహం
- ఎంపీడీఓ ఏం చేస్తున్నారని సూటి ప్రశ్న



మాట్లాడుతున్న ఎంపీపీ రోజా తదితరులు

పలమనేరు: మండల పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో తన ప్రమేయం లేకుండా కూర్చుని టీడీపీ నాయకులు ప్రెస్‌మీట్ నిర్వహించడం ఏమిటని ఎంపీపీ రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సీటులో కూర్చుని టీడీపీ నాయకులు ఇంత చేసినా ఎంపీడీఓ ఏం చేస్తున్నట్టు అని ప్రశ్నించారు. శుక్రవారం తన చాంబర్‌లో ఆమె మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తాను మండలంలోని మూడు పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించి ఎందుకు ఆలస్యం చేస్తున్నారని నోటీసు ఇచ్చానన్నారు. దీనిపై టీడీపీ నాయకులు తమ చాంబర్‌లోకి వచ్చి మండలంలో గత ప్రభుత్వ హయాంలో అసలు అభివృద్ధే లేదని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వం మండలంలో ఎన్నికోట్లతో అభివృద్ధి చేసిందో గణాంకాలతో సహా సంబంధిత శాఖల ద్వారా తెలుసుకోవచ్చన్నారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ, ఎంపీపీ హక్కులను సైతం భంగం కలిగించేలా టీడీపీ నాయకులు వ్యవహరించడం సరికాదని ఆక్షేపించారు. కొలమాసనపల్లె ఎంపీటీసీ టీడీపీ అయినా ఏరోజూ తాము మండల సమావేశాల్లో తక్కువగా చూడలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము అక్రమాలకు పాల్పడి ఉంటే కొలమాసనపల్లె, పెంగరగుంటలో టీడీపీ అభ్యర్థులు ఎలా గెలిచారో చెప్పాలన్నారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలాజీనాయుడు గతంలో కాంగ్రెస్ మద్దతు సర్పంచుగా ఇప్పటి టీడీపీ మండల ప్రెసిడెంట్ భార్యని గెలిపించడమే ఆయన చేసిన తప్పా? అని ప్రశ్నించారు. నాడు రాజకీయ భిక్ష పెట్టిన తమను ఇప్పుడు టీడీపీలోకి వెళ్లిన వారు నోటికొచ్చినట్టు మాట్లాడడం సరికాదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఉపాధిలో అక్రమాలు, ఇసుక దందా, మద్యం సిండికేట్‌తో అడ్డగోలుగా సంపాదిస్తున్నారని, వారు విలువలు గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సముద్రపల్లె సర్పంచ్ తిరుమలేష్ మాట్లాడుతూ, గత వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాల్లో కట్టిన పలు శాఖల భవనాలు, నాడు–నేడు ద్వారా మారిన బడులు టీడీపీ నాయకులకు కనిపించలేదేమో ఓసారి వెళ్లి చూడాలని చురకలంటించారు. మండల కన్వీనర్ బాలాజీ నాయుడు మాట్లాడుతూ, గత ప్రభుత్వ పాలనలో రూ.15కోట్లతో మండలంలో అభివృద్ధి పనులు చేశారని స్పష్టం చేశారు. టీడీపీ రూరల్ ప్రెసిడెంట్‌గా నాగరాజు రెడ్డి ఎన్నోవాడోగానీ తాను మాత్రం గతంలో కాంగ్రెస్, ఆపై వైఎస్సార్‌సీపీలో పదేళ్లగా అధ్యక్షుడిగానే కొనసాగుతున్నారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, ఇప్పుడు సూపర్‌సిక్స్‌తో మీరు జనానికి పెట్టిన టోపీపై క్షేత్రస్థాయిలో వెళ్లి అడిగితే తెలుస్తుందన్నారు. గుమ్మడికాయ దొంగ అంటే భుజాలను తడుముకున్నట్టు తమ ఎంపీపీ గతంలో ఇచ్చిన వర్క్ ఆర్డర్లపై మాట్లాడితే దీనిపై ఇంత రాద్ధాంతం ఎందుకని ప్రశ్నించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ జయశ్రీ, నాయకులు చెంగారెడ్డి, రాజారెడ్డి, మోహన్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, గోవింద్, ఎంపీటీసీలు రమేష్, సర్పంచులు మునస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన వర్షపునీటితో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

- ఆర్‌యుబీ వద్ద తప్పని అవస్థలు

కుప్పం రూరల్: కుప్పం–డీకే పల్లె మధ్య రైల్వే లైన్ కింద నిర్మించిన ఆర్‌యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జి) వద్ద వర్షం వస్తే రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. చిన్నపాటి వర్షం కురిసినా అండర్‌బ్రిడ్జి వద్ద నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఈ మార్గం మీదుగా పదుల సంఖ్యలో గ్రామాలతో పాటు హాకింగ్స్, మౌంట్ ఫోర్ట్, పాలిటెక్నిక్, గురుకుల, కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయి. వర్షపు నీటి నిల్వలోనే పడుతూ లేస్తూ వెళ్లాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ ఈ పరిస్థితి తలెత్తుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.